www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు కలెక్టరేట్‌లో 3వ తేదీ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం..

- సురక్షితంగా గమ్యస్థానాలు చేరుదాం..
- 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మనిషి ప్రాణం ఎంతో విలువైనది.. అటువంటి ప్రాణాలను అతివేగం కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది పోగొట్టుకోవడం మనం చూస్తూనే ఉన్నాం.. ప్రతి వాహనదారుడు వాహనాల నడిపే సమయంలో రహదారి నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాల భారి నుండి కొద్దిమేర తప్పించుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించే నిమిత్తం రోడ్డు భద్రతా మాసోత్సవాలను జనవరి 15 నుండి ఫిబ్రవరి 16 వరకు నెల రోజుల పాటు సడక్ సురక్షా అభియాన్ కింద రోడ్డు భద్రతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా రవాణా శాఖ ద్వారా జిల్లాలో చేపడుతున్నారు.

నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు అధిక శాతం దాకా చనిపోతున్నారని అంచనా. జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో మొత్తం 711 ప్రమాదాలు జరిగి 373 మంది చనిపోగా, 792 మందికి తీవ్రగాయాల పాలయ్యారు. అలాగే 2023లో 703 ప్రమాదాల్లో 351 మంది చనిపోగా, 854 మందికి తీవ్రగాయాలు, 2024లో 751 ప్రమాదాల్లో 400 మంది చనిపోగా, 891 మంది తీవ్ర గాయాలు పాలయ్యారు. 2024 అందులోనూ ద్విచక్ర వాహనాల ద్వారా 209 ప్రమాదాలు జరిగి 122 మంది చనిపోయారు, 128 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో హెల్మెట్ ధరించని వారే అధిక శాతం. హెల్మెట్ పెట్టుకుంటే ఏదైనా ప్రమాదం జరిగినా కూడా తలకు గాయం కాకుండా తద్వారా మరణించకుండా బయటపడవచ్చు. పెద్దపెద్ద సినీ హీరోలు, క్రీడాకారుల, రాజకీయ ప్రముఖుల కుమారులు, యువత హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మరణించారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ (ఫైల్ ఫొటో)

మోటారు వాహన చట్టం 1988, సెక్షన్ 129 ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనదారుడు అతని వెనుక కూర్చొన్నవారు హెల్మెట్‌ను కచ్చితంగా ధరించాలి. హెల్మెట్ కూడా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం 4151 ఉన్నదే వాడాలి. ధర తక్కువలో దొరుకుతున్నాయని నాసిరకం హెల్మెట్ వాడడం వల్ల లాభం లేదు. సుప్రీం కోర్టు వారు కూడా ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించే విధంగా చట్టాన్ని అమలు చేయాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించడం జరిగింది. మోటార్ వాహన చట్టం రూల్ 138 (ఎఫ్) ప్రకారం డీలర్ ద్విచక్ర వాహనం అమ్మేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు అమ్మవలెనని నిర్దేశిస్తున్నది. దీనిపై డీలర్లందరికీ అవగాహన కల్పించారు. కనుక మిమ్ములను మీ కుటుంబాన్ని రహదారి ప్రమాదాలలో కాపాడుకొనేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి..



హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ..

మోటారు వాహనాల చట్టం సెక్షన్ 129 ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి లేకుంటే సెక్షన్ 177 ప్రకారం జరిమానా రూ.1000లు విధించబడుతుంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపటం అత్యంత ప్రమాదకరం. సెల్‌ఫోన్ మాట్లాడుతు వాహనం నడిపిన వారికి సెక్షన్ 184 ప్రకారం రూ.1000లు జరిమానాతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికయిగా రద్దు చేయబడుతుంది. మద్యం తాగి వాహనం నడిపితే మోటారు వాహన చట్టం సెక్షన్ 185 ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్ష విధించబడుతుంది.

కచ్చితంగా హెల్మెట్ ధరించాలి: కలెక్టర్

ప్రతి వాహనదారుడు వాహనాన్ని నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి నడపాలి. మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలను నడపడం చేయకూడదని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా వాసులు విజ్ఞప్తి చేశారు. గత మూడు సంవత్సరాల కాలంలో సంభవించిన రోడ్డు ప్రమాదాల మరణాలలో ద్విచక్ర వాహనదారులు అధిక సంఖ్యలో మరణించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయని, యువత మత్తు పానీయాలు సేవించడం, అతివేగంగా వాహనాలను నడపడం ద్వారా కూడా మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయని తెలిపారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి జాగ్రత చర్యలు చేపడుతున్నామని, గుంతలను పూడ్చడం, పెండింగ్ ఉన్న రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారి పై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మెరుగైన జీవనోపాధి కల్పనే లక్ష్యం

- ఎస్సి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి
- బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మెరుగైన జీవనోపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ సబ్సిడీ రుణాల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు మంజురు చేసింది. బీసీ కార్పొరేషన్ కింద అర్హత ఉన్న ఈబిసి, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాల వారికి 50 శాతం సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా 2,800 యూనిట్లకు సబ్సిడీ కింద రూ.61.25 కోట్లు రుణాలు, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 916 క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలకు రూ.14 కోట్లు మంజూరు చేసిందని బీసీ కార్పొరేషన్ ఈడి శ్రీదేవి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో బీసీ కార్పొరేషన్ రుణాలను వివరాలను తెలియజేశారు.

ప్రజాశక్తి : బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాల సబ్సిడీ ఎంత?

ఈడీ: బీసీ కార్పొరేషన్ ద్వారా 2,800 యూనిట్ల మంజురు కోసం ప్రభుత్వం రూ.61.25కోట్లు మంజురు చేసింది. 50 శాతం సబ్సిడీతో మంజురు చేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి: బీసీలు అంటే ఏఏ కులాలు ప్రభుత్వం మంజురు చేస్తున్న రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు?

ఈడీ: అర్హత ఉన్న ఈబిసి, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలు ప్రభుత్వం అందించే బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు.

ప్రజాశక్తి : ఎప్పటి నుండీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి?



శ్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

ఈడీ: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు జనవరి 30వ తేది నుండీ ఫిబ్రవరి 7వ తేది వరకు దరఖాస్తులు చేసుకొనే అవకాశముంది. సబ్సిడీ రుణల కోసం కుల ధవీకరణ, రేషన్ కార్డు, వయసు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా కలిగిన వారు సచివాలయాల పరిధిలో డిజిటల్ అసిస్టెంట్ సహకారంతో వెబ్ సైటు ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి.

ప్రజాశక్తి: బీసీ వసతి గృహాల పరిస్థితి జిల్లాలో అత్యంత దారుణంగా ఉంది. వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందా?

ఈడీ: రాష్ట్రంలోని బీసీ హాస్టల్లో వసతుల మరమ్మతుల కోసం రూ.25కోట్లు మంజూరు చేయడం జరిగింది. త్వరలో జిల్లాలోని బీసీ వసతి గృహాల మరమ్మతులకు టెండర్లు ఆహ్వానించి పనులు మొదలుపెట్టడం జరుగుతుంది.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా
ముందుకు సాగుతున్నాం

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు.



సభలో మాట్లాడుతున్న నాగబాబు

ప్రజాశక్తి- సోమల: నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కాలం అయిందని ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. మండల కేంద్రమైన సోమలలో ఆదివారం జనంలోకి జనసేన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులను జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను తన ప్రసంగంలో తూర్పారబట్టారు. ఏడు నెలల కాలంలో పింఛన్లు, వంటగ్యాస్, గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతులు, గిరిజన అభివృద్ధి, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పలు పరిశ్రమలు తీసుకురావడం, విత్తనాలు ఎరువుల రాయితీ, ఉపాధి హామీ ద్వారా పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం నుండి కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి ప్రజాపాలన ప్రజా సంక్షేమాన్ని చేపట్టామని అయితే వైసిపి సన్నాసులు, రౌడీలు, గూండాలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వీరందరికీ బుద్ధి చెప్పేందుకు అభివృద్ధి చేసి చూపించి తీరుతామని అన్నారు. పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమ సంపాదన రెండు లక్షల కోట్లకు పైగా ఉంటుందని ఈ సంపాదన తమ అక్రమ ఆస్తుల విలువ రాష్ట్ర బడ్జెట్ను దాటి పోయిందని అన్నారు. ఎన్నో ఎకరాల భూములు దోచుకోవడం, మదనపల్లి ఫైల్స్ దగ్ధం, పాడి రైతుల దోపిడీ, మైనింగ్ ఇసుక మాఫియా, భూముల ఆక్రమణ, అక్రమ దందా మద్యం, అటవీ శాఖ భూములు ఆక్రమణ, ఎర్రచందనం తరలింపు కోసం రోడ్లు వేయడం వీటన్నిటినీ ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఎంతటి వారినైనా అందరి అరాచకాలను కట్టుబెట్టి అక్రమస్తులను వెలికి తీసి బయటపెడతామని తీవ్ర ఆగ్రహంతో సభలో ప్రసంగించారు.

ఖాళీగా కుర్చీలు..

మధ్యాహ్నం బహిరంగ సభకు రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు వేదిక మీదకు రాగానే అధిక శాతం మంది మహిళలు ఆయనను చూసి సభ నుండి వెనుతిరిగి వెళ్లిపోయారు. సభాస్థలి వద్ద సగానికి పైగా కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. పోలీసులు మెటల్ డిటెక్టర్ ద్వారా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సభాస్థలిలోకి పంపించారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సభాసలు వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బహిరంగ సభకు వచ్చిన అందరికీ భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, జిల్లా నుండి వచ్చిన పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

జర్నలిస్టు హక్కుల సాధనకై

సమరశీల పోరాటాలకు సిద్ధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) పోరాటాలకు సిద్ధంగా ఉందని రాష్ట్ర నాయకుడు కవరకుంట్ల జయరాజు తెలిపారు. ఆదివారం చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవన్‌లో చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల భద్రత కోసం మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే జర్నలిస్టులను వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తించాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో దాడులు నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల ఐక్యత వారి హక్కుల పరిరక్షణ కోసం చిత్తూరులో ఫిబ్రవరి చివరి వారంలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా జయచంద్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కోశాధికారి అక్రమ్ నిర్వహించారు. చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షుడు సాటి గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిశేఖర్, కోశాధికారి కృపానందరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి దినేష్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆలకుంట కేశవులు, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం

జిల్లా సమగ్ర అభివృద్ధిపై పోరాటాలు

రాష్ట్ర మహాసభల్లో జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



మూడు రోజులపాటు నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో రెండవ రోజు చిత్తూరు జిల్లా రిపోర్టును జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న మామిడి రైతులను ఆదుకోవాలని, పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, ఎక్స్ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్ రహదారుల సందర్భంగా భూమి కోల్పోయిన రైతులకు వారికి నష్టపరహారం చెల్లించాలని తెలిపారు. ఇలాంటి సమస్యలపై ఈ సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తులో బలమైన పోరాటాలు చేస్తామని మహాసభల్లో తెలిపారు.

చిక్కరు.. దొరకరు..

- పట్టించుకోని పోలీసులు
- నష్టపోతున్న రైతులు, ప్రజలు



ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 222 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలో 90 శాతం పైగా రైతు కుటుంబాలు, వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తూ కుటుంబాలే అధికంగా కనిపిస్తాయి. మండలంలో నిత్యం ఏదోఒక చోరీ జరుగుతూనే ఉంది.. రైతులు ప్రజలు నిత్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు.. కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి.. కానీ చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకోవడంలో మాత్రం పోలీసులు వైఫల్యం చెందుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో, పంట పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, స్టార్టరు నుంచి కాపర్ వైర్లు ఎక్కువగా చోరీకి గురైతున్నాయి.. అలాగే మూలనపడ్డ రైస్ మిల్లులోని ఇనుప వస్తువులు, మోటర్లు, ట్రాన్స్ఫార్మర్‌లోని రాగి వైరు వీరి ప్రధాన లక్ష్యంగా మారింది. దీంతో రైతులు మరల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు అమర్చుకోలేక... విద్యుత్ శాఖ అధికారులు చుట్టూ తిరగలేక నానా ఇబ్బందులు పడుతున్నారు..

మండలంలోని మాంబేడు పంచాయతీ రోడ్డుకు ఆనుకునే ఉన్న అయ్యప్ప రైస్ మిల్లులో 2010లో దొంగలు పడ్డారు. అందులో ఉన్న విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. వెనుక వైపు అమర్చిన ట్రాన్స్ఫార్మర్‌తో సహా. ఇప్పటికీ గుర్తుగా ఆ ఖాళీ స్థలం అలానే దర్శనమిస్తుంది. 2021 అక్టోబర్ నెలలో పచ్చికాపల్లం వాసు హార్డ్వేర్‌లో రెండు పర్యాయాలు దొంగలు పడ్డారు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పురోగతి లేదని ఆ యజమాని చెబుతున్నాడు. అలాగే 2024 అక్టోబర్ నెలలోనే బ్రాహ్మణపల్లి సమీపంలో చంద్రమ్మ కుటుంబ సభ్యుల వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైరు ఆయిల్ ఎత్తుకెళ్లారు. 2024 నవంబర్ నెలలో పచ్చికాపల్లంపేట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ గుడి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదును తీసుకెళ్లేందుకు విపలయత్నం చేశారు. గ్రామస్తులు గుర్తించడంతో దొంగతనానికి ఉపయోగించిన పరికరాలను ఆలయం బయటే వదిలి వెళ్లారు. ఆ గ్రామస్తులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదని గ్రామస్తులు చెబుతున్నారు. మండలంలో జరిగిన దొంగతనాలు కొన్ని మాత్రమే. మండల వాసులను కదిలిస్తే... ఇంకా ఎన్నో.. సంబంధిత అధికారులు స్పందించి ఈ దొంగతనాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చోరీకి గురికావడంతో అలాగే ఖాళీగా ఉన్న స్తంభం

దొంగలను పట్టుకోలేదు...

- మునికృష్ణ, పచ్చికాపలం పేట


మా గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి నగలు, నగదు కోసం పట్టపగలే దొంగలు బీరువాను పగలగొట్టే ప్రయత్నం చేశారు. అందరం చుట్టుపక్కల వ్యవసాయ పనులు చేస్తున్నడంతో గమనించి కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. దొంగతనానికి ఉపయోగించే కిట్లు అక్కడే వదిలి వెళ్లారు. వాటిని పోలీసులకు అప్పగించాం. ఎస్సైకి ఫిర్యాదు చేశాం అయినా ఇప్పటి వరకు దొంగలను పట్టుకోలేదు.



మనుషులు తిరిగే ప్రాంతాంలోనే చోరీలు

- చంద్రమ్మ, బ్రాహ్మణపల్లె గ్రామం

మా బంధువుల చేను ఊరికి ఆనుకునే ఉంది. రోడ్డుకి పక్కనే నిత్యం ఎవరో ఒకరు ఆ దారి గుండా తిరుగుతూనే ఉంటారు. అయినా దొంగలు ఎంత ధైర్యంగా ట్రాన్స్ఫార్మరు కిందికి దించి పగలగొట్టి అందులో ఉన్న రాగి కమ్మీలను తీసుకునిపోయారు. చోరీ సమయంలో ఎవరైనా అటువైపుగా వచ్చి ఉంటే చంపేసేవాల్లేమో.. వాళ్లను పోలీసోళ్ళు త్వరగా పట్టుకోవాలి. మాకు రక్షణ కల్పించాలి.



ఫిర్యాదు చేశాం.. ఫలితం లేదు..

- వాసు, హార్డ్వేర్ షాపు యజమాని, పచ్చికాపల్లం

మా షాపులో రెండుసార్లు చోరీలు జరిగాయి. నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల సహాయంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాం. ఇంతవరకు వారి పట్టుకున్నది లేదు.. మాకు న్యాయం జరగలేదు.. ఇనైనా దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కడా పీడీ వికాస్ మరమత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ వికాస్ మరమత్ సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి మూడవ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కడా పీడీ ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పీడీ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

సిఎంను కలిసిన సుహేల్ బాషా



ప్రజాశక్తి-పుంగనూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు, సామాజిక వేత్త సయ్యద్ సుహేల్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు మెమెంటోను అందజేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి నియోజకవర్గ మైనార్టీ సమస్యల గురించి వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముష్టాక్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి మైనార్టీ కార్పోరేషన్ లోన్లు ప్రతి ఒక్క అర్హులకు పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం


ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఆదివారం మండలంలోని బోడబండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మాజీ మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మల మొగులేశ్వర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ ముఖ్యమైన ప్రశ్నాపత్రాల తయారుచేసి అందివ్వడం చాలా శుభ పరిమాణమని అన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌లోని ప్రశ్నలను జవాబులను అభ్యసించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. యుటిఎఫ్ మాజీ మండల అధ్యక్షులు మొగిలయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్పంచ్ ఉచితంగా ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మంత్రి లోకేష్ యువగలం హామీని నెరవేర్చారని మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ యువగలం పాదయాత్ర బంగారుపాళ్యం చేరుకుని నేటితో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని బంగారుపాళ్యంకు చేరుకున్నప్పటికీ 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కిడ్నీ బాధితులకు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి చెప్పిన హామీని నెరవేర్చిన ఘనత మంత్రి లోకేష్‌కి దక్కుతుందని అన్నారు. ఈ డయాలసిస్ కేంద్రం వలన నియోజకవర్గంలోని పలువురు డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, ఉపాధ్యక్షులు కమల్‌నాథ్ రెడ్డి, నాయకులు లోకనాథం నాయుడు, సిద్ధయ్య, సూరి నాయుడు, గిరిబాబు, రమేష్, రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

నాగబాబుకు వేణుగోపాల్ రెడ్డి ఆతిథ్యం



వేణుగోపాల్ రెడ్డి ఇంట్లో నాగబాబు, ప్రముఖులు

ప్రజాశక్తి- పుంగనూరు: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొణిదల నాగబాబు ఆదివారం మధ్యాహ్నం పుంగనూరులో జనసేన నాయకుడు ఎన్.వేణుగోపాల్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. రేణిగుంట ఎయిర్ పోర్ట్‌లో దిగిన నాగబాబుతో పాటు రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు పుంగనూరు జనసేన నాయకుడు వేణుగోపాల్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం నాగబాబు పుంగనూరు మండలం చదళ్లలో జనసేన పార్టీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి గృహానికి విచ్చేసి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. నాయకులు శివ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే మానసిక సంతృప్తి

పిపిఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్ళై



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో పరిరక్షణ సమితి ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక ఎన్జీవో భవనంలో ఘనంగా జరిగాయి. పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలమనేరులో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా యువకుల్లాగా సమాజ సేవచేస్తున్న పిపిఎస్ సేవలను కొనియాడారు. పిపిఎస్ నిస్వార్ధంగా చేసే సేవలకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. సంస్థ గౌరవ అధ్యక్షులు ఆనందబాబు మాట్లాడుతూ పట్టణంలో నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రశంసలు అందుకుంటున్న పిపిఎస్ కార్యవర్గాన్ని అభినందించారు. 2024- 25 సంవత్సరంలో సంస్థ చేపట్టిన 35 పైగా కార్యక్రమాలను గురించి కార్యదర్శి టిఎల్. నరసింహులు ఆహుతులకు వివరించి మన్ననలు పొందారు. సంస్థ ఆర్థిక నివేదికను కోశాధికారి కే.జే.సన్నిరాజు సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ పలమనేరులోని ఎన్నో సమస్యలకు పలమనేరు పరిరక్షణ సమితి ద్వారా పరిష్కారం చేయడం అనేకచోట్ల పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లు కొనివ్వడం చెట్లు నాటడం తనకు చాలా సంతృప్తిని కలిగించిందన్నారు. వల్లూరి సరిత భరతనాట్యం, డాక్టర్ బి.రజిని డాన్స్ అకాడమీ, వీరాధి విజయ్ కుమార్ యోగా గురువు, దేవేంద్ర నాయుడు కరాటే మాస్టర్, ఏఎన్.బాలాజీ భగవద్గీత బోధకులు, రిషబ్ ఓస్వాల్ పంత్ ఆల్ ఇండియా సీఏ ఫస్ట్ ర్యాంకర్, ఎం.విజయ్ కుమార్, ఎం.నాగప్ప అను వారిని ఉత్తమ సేవా పురస్కారాలు ప్రధానం చేసి అభినందించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు హరి, పట్టణ ప్రముఖుడు ఆకుల గజేంద్ర, సత్య ప్రకాష్, జీలూభాయ్, ఎల్లంపల్లి నరేంద్ర పాల్గొన్నారు.

8 ద్విచక్ర వాహనాలు సీజ్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పోలీస్ సిబ్బంది మండలంలోని మొగిలివారిపల్లి పంచాయతీ ఇందిరానగర్ కాలనీ, పాలమాకులపల్లిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనున్న గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించి ఎలాంటి రికార్డ్స్ లేని 8 మోటార్ సైకిల్స్‌ను సిజ్ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తుల సంచరిచ్చేటప్పుడు వారి వివరాలు సేకరించుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది బాబు, రమేష్, నీరజాక్షులు, సురేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

యువత రక్తదానం



ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పిఈఎస్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు ద్రావిడ విశ్వవిద్యాలయం విద్యార్థులు రక్తదానం చేశారు. బైరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన మునెమ్మ అనారోగ్యంతో కుప్పం పిఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు చికిత్స నిమిత్తం రక్తం అవసరం కాగా ఆమె బంధువులు కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్‌ను సంప్రదించారు. ఈ విషయమై స్పందించిన ఆయన వెంటనే ద్రావిడ విశ్వవిద్యాలయ విద్యార్థులు హరీష్, వెంకట్, రాఘవ్ సంప్రదించగా వారు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

350 మందికి ఉచిత వైద్యం



ప్రజాశక్తి - రామకుప్పం: ప్రియా నర్సింగ్ హోమ్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో 350 మందికి ఆదివారం ఉచిత వైద్య చికిత్సలు అందించారు. రామకుప్పం మండలంలోని చిన్న బల్దారు గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మూత్ర సంబంధిత వ్యాధులు, కిడ్నీలో రాళ్లు, ఎముకలు, విష జ్వరాలు, షుగర్, బిపి, సాధారణ పరీక్షలు నిర్వహించి ఎన్టీఆర్ వైద్య పథకం ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో వివిధ సమస్యలతో బాధపడుతున్న 30 మందిని ఆపరేషన్ల కొరకు ఎంపిక చేసి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ మెడికల్ అసోసియేషన్ మెంబర్స్ తులసీరాం, విజయ్ మోహన్, మధురం, దయాకర్, ప్రియా నర్సింగ్ హోమ్ వైద్యులు వెంకటేశ్వర్లు, సత్యం, వెంకటలక్ష్మి, ప్రశాంత్, గుండువెల్, సుబ్బారెడ్డి, పిఆర్ఏ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని వివిపురం పంచాయతీ ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన లేట్ చిన్న బుచ్చినాయుడు భార్య పైనే మునెమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు ఆదివారం స్వగ్రామంలో పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. ఇటీవల మునెమ్మ మరణించడంతో ఆదివారం స్వగ్రామంలో ఉత్తరక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచే పెద్ద బాలశిక్ష 1000 పుస్తకాలను పంపిణీ చేశారు. పైనేని విజయేందర్ నాయుడు, పైనేని తులసినాథం నాయుడు, మురళి పుష్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండి చేయి

సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా

ప్రజాశక్తి- పలమనేరు



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ మొండి చేయి చూపిందని సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం ఎదుట కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆశలను అడి ఆశలు చేశారని, కేంద్రం మరొకసారి రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. ఏ జాతీయ విద్యాసంస్థలను కేటాయింపులు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజా, జయంతి, ధనమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.

దేవయ్య సేవలు ఆదర్శనీయం



దేవయ్య సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా వివిధ హోదాల్లో పని చేసిన దేవయ్య సేవలు నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన దేవయ్య సన్మాన కార్యక్రమం హెచ్ఎం అరుణ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా దేవయ్య సేవలను వక్తలు కొనియాడారు. దాతల సహకారంతో తాను పని చేసిన చోట విద్యార్థులకు విద్యాసామగ్రి, పాఠశాలలకు మౌళిక వసతులు కల్పనలో కీలకపాత్ర పోషించారన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయకుమార్ మాట్లాడుతూ దేవయ్య వృత్తి పట్ల అంకిత భావం, క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. స్థానిక సర్పంచ్ దివ్య, పాఠశాల కమిటీ చైర్మన్ శాంబశివ ఆచారి, ఎస్టీయూ కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మదన్మోహన్రెడ్డి, మోహన్, యువరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీఆర్‌టీయూ గురుమూర్తి, డైట్ అధ్యాపకుడు చెంగల్రాజు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మారుతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కుప్పం పిఈఎస్ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు వారిచే కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని కంటి వ్యాధితో బాధపడుతున్న వారు 74 మంది హాజరుకాగా వారికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారిలో 9 మందిని కంటి ఆపరేషన్‌కు గుర్తించారు. గుర్తించిన వారికి కుప్పం పిఇఎస్ హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్ చేయించి, ఉచిత బస్సు సౌకర్యం, ఆపరేషన్ ఖర్చులు, ఉచిత భోజన సౌకర్యం కల్పించినట్లు మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది, హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.



సేవా సంఘం సమావేశం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలో వక్కలిగా సేవా సంఘం తరపున కుల సంఘం సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా వక్కలిగా కుల సంఘం గురువులు మంగళానందనాథ స్వామి విచ్చేశారు. ముఖ్య అతిథులుగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు హాజరయ్యారు. విశిష్ట అతిథి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కుప్పం పరిధిలో తమ సంఘానికి ప్రభుత్వం తరపున స్థలం కేటాయిస్తే పాఠశాలను నిర్మించి, పేద విద్యార్థులకు విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందిస్తామని తెలియజేస్తూ, ఎమ్మెల్సీ, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులకు వినతి పత్రాలను అందజేశారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో మేటిగా నిలిచిన శ్లోక-ఎ బిర్లా స్కూల్

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

అమేతి అంతర్జాతీయ పాఠశాల, సెక్టార్ 46, గురుగ్రామ్, హర్యాన నందు సీబిఎస్ఇ- జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలో ఉన్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. ఆదివారం విజేతలైన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ఈ ప్రదర్శనలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల నుండి ఔత్సాహికులు పాల్గొనగా శ్లోక ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఆర్టిఫిషియల్ రైపనర్ డిటెక్టర్(రసాయనాలతో మాగబెట్టిన పండ్లను గుర్తించే పరికరం) ప్రాజెక్టు అందరి మన్ననలు పొంది విజేతగా నిలిచింది. యావత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యంగా నిలిచిన పాఠశాల విద్యార్థులు బాలాదిత్య, కేతన్ క్రిష్, మెంటార్ ఎమ్. సతీష్ గర్వించదగ్గ విజయాన్ని అందించినందుకు పాఠశాల యాజమాన్యం అభినందించారు. డైరెక్టర్ శ్రీవత్సవ, ప్రిన్సిపల్ వీణవాణి, ఉపాధ్యాయులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తామని తెలియజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అధ్వానంగా రోడ్డు

అవస్థలు పడుతున్న వాహనదారులు



గుంతలమయమైన అగ్రహారం - తమిళనాడు పొన్నై రోడ్డు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీలోని అగ్రహారం గ్రామం నుండి కొత్త వెంకటాపురం ఆది ఆంధ్రవాడ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారడంతో పాటు కంకర రాళ్ళు తేలిపోయింది. దీంతో ఈదారిలో ద్విచక్ర వాహనాలు, పాలు వ్యాన్‌లు, కార్లుతో పాటు చిత్తూరు - కొత్త వెంకటాపురంకు ఆర్టీసీ బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తుండగా అప్పుడప్పుడు టైర్లు పంక్చర్‌లు కావడంతో పాటు వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డులో గత ఐదేళ్లుగా ప్రయాణం చేస్తూ నిత్యం అవస్థలు పడుతున్నామని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర రోడ్డు ఉందని, నిత్యం తమిళనాడులోని పొన్నైకి రాకపోకలు సాగే ఈ రోడ్డులో మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రరజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఈ గుంతల రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- గుడిపల్లి : మండలంలోని ముత్యాలపాలెం గ్రామం దాసమానపల్లి పంచాయతీకి చెందిన ఎల్లప్ప అనారోగ్యంతో ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి గోవిందస్వామి ఆధ్వర్యంలో వారి కుటుంబానికి వ్యక్తిగత డబ్బును మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు సాయం చేశారు.

కెంపసముద్రంలో పశువుల పండుగ

ప్రజాశక్తి -రామకుప్పం: మేజర్ గ్రామ పంచాయతీలోని కెంపసముద్రంలో పశువుల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలోని రైతులు తమ పశువులను శుభ్రం చేసి రంగురంగుల పూలకాగితాలతో సుందరంగా అలంకరించారు. గ్రామ దేవత గంగమ్మ ఆలయం వద్ద విశేష పూజలు చేసి గ్రామ ప్రధాన వీధిలో పరుగులు తీయించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పశువుల పండుగను తిలకించారు.

5న ధర్నాను జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈనెల 5న చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి కోరారు. ఆదివారం మండలంలోని పాలేరు గ్రామం వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి స్వగృహంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ అందివ్వకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని, విద్యా సంవత్సరం ముగిస్తున్న ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించి విద్యార్థులని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో 18 వేల కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించారని, గత టిడిపి ప్రభుత్వంలో 2800 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించామని, ప్రస్తుత సంవత్సరానికి 3800 కోట్ల రూపాయలు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా చెల్లించాలని వీటిని చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వానికి కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం కనబడుతున్నాయని పేదవాడి ఆకలి కనబడడం లేదన్నారు. అనంతరం ఫీజుపై పోరు కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి హేమచంద్ర, దత్తురెడ్డి, సర్దార్, అన్నామల్ రెడ్డి, విజయ్ కుమార్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అందరూ తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు హాజరు కాగా ఆనాడు విద్యాభ్యాసం నేర్పించిన గురువులకు సత్కరించి దుశ్శాలువలతో మెమెంటోలతో వారిని గౌరవించారు. పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం కృషి చేస్తామని పలువురు విద్యార్థులు సభాముఖంగా తెలియజేశారు. అదేవిధంగా పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని కూడా వాసవి క్లబ్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు పూర్వ విద్యార్థి చిత్తలూరు సురేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గురువులు రాయప్ప రెడ్డి, పాపిరెడ్డి, విజయ కుమారి, కుసులన్న, సహదేవ రెడ్డిలకు వెంకటేశ్వర స్వామివారి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, లక్ష్మణ, జయప్రకాష్, సుజాద్ అలీఖాన్, రమేష్‌రెడ్డి, రెడ్డప్ప, జయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల పాటల పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఘంటసాల 'ది గ్రేట్' చిత్రం విడుదల వుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని, రాష్ట స్థాయి ఘంటసాల పాటల పోటీలు ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సుమారు 40 మంది గాయనీ గాయకులు ఈ పోటీలో పాల్గొన్నారు. మూడు విభాగాల్లో మొదటి బహుమతి15000, రెండవ బహుమతి 10000, మూడవ బహుమతి 5000 రూపాయలతో పాటు కన్సోలేషన్ ఒక్కొక్కరికి రూ.500 అందజేశారు. ఈకార్యక్రమంలో ఘంటసాల అభిమానులు, సహృదయ సంస్థ అధినేత పీ.రాజేష్, వై .అరవింద్, తదితరులు పాల్గొన్నారు.